సాక్షి

పార్వతీపురం మన్యం

మంగళవారం । 24 । జనవరి । 2023



ఆటకు అగ్రతాంబూలం

నెల్లిమర్ల మండలం అలుగోలు ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో అండర్–17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రారంభించారు. - 8లో



రాజ్యాంగం పట్ల టీడీపీకి గౌరవం లేదు

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులకు గౌరవం లేదని వైఎస్సాఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. - 8లో



జీఎంఆర్ దంపతులకు సత్కారం

రాజాం: రాజాంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దర్శనానికి వచ్చిన పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు దంపతులను రాజాం ఆర్య వైశ్య సంఘ సభ్యులు సోమవారం సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

న్యూస్‌రీల్

అప్రెంటిస్ షిప్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ రేపు

సీతంపేట: సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ షిప్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ బుధవారం జరగనుందని ప్రిన్సిపాల్ టి.వి.గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్ విభాగాల్లో ఉత్తీర్ణులైన వారు, పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. మేధా సెర్వో ప్రైవేట్ లిమిటెడ్‌లో అప్రెంటిస్ షిప్ ఉంటుందన్నారు. రాతపరీక్షలో అర్హత మార్కులు 50 శాతం కంటే ఎక్కువ ఉండాలన్నారు. స్టైఫండ్ రూ.14,500లు ఇస్తారని తెలిపారు. వివరాలకు సెల్: 9440323843, 9390063881 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దత్తివలసలో ఏనుగులు



దత్తివలస పంట పొలాల్లో ఉన్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస/గరుగుబిల్లి: చింతలబెలగాం గ్రామ పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో ఆదివారం సంచరించిన ఏనుగులు సోమవారం ఉదయం దత్తివలస గ్రామ సమీపంలోని పంటపొలాల్లోకి చేరుకున్నాయి. నాగావళి నది, గుమ్మిడిగెడ్డ వాగులో తిష్టవేశాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. అటవీ శాఖాధికారులు స్పందించి ఏనుగులు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులపై చర్చ



కలెక్టర్ నిషాంత్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం: పార్వతీపురం నియోజకవర్గం పరిధిలోని గిరిజనుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. సవరభాష విద్యావలంటీర్లను రెన్యువల్ చేయాలని కోరుతూ ఎమ్మెల్యే జోగారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వెంటనే కలెక్టర్, ఐటీడీఏ పీఓ దృష్టికి వలంటీర్ల వినతిని ఎమ్మెల్యే తీసుకెళ్లారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌తో సమావేశమై నియోజకవర్గంలోని పలు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



ఆహారశుద్ధి యంత్రాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

విజయనగరం ఫోర్ట్: లాభదాయకమైన, ప్రజలకు ఆరోగ్యాన్నిచ్చే చిరుధాన్యాల సాగుపై రైతులు ఆసక్తిచూపాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి కోరారు. విజయనగరం ఆనందగజపతి ఆడిటోరియంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి మిల్లెట్ మహోత్సవం సోమవారంతో ముగిసింది. రెండో రోజు ఆహార శుద్ధి యంత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు తినడం క్రమేపి అలవాటు చేసుకోవాలని ప్రజలను కోరారు. జంక్‌ఫుడ్స్‌తో అనారోగ్యంబారిన పడతారని హెచ్చరించారు. వైద్యులు సైతం చిరుధాన్యాలను తినాలని చెబుతున్నారన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు 35 శాతం రాయితీపై ఆహార శుద్ధి యంత్రాలను అందిస్తామని చెప్పారు. ఇంట్లో వినియోగించే విద్యుత్‌తో వీటిని వినియోగించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, నాబార్డు ఏజీఎం అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

విజయనగరం అర్బన్: ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు చేపట్టే జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్ష షెడ్యూల్ విడుదయింది. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులుగా నిర్వహించే ఈ పరీక్ష మంగళవారం నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 3,135 మంది కోసం గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఐయాన్ డిజిటల్ జోన్, డెంకాడ మండలం చింతలవలసలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఒక్కోపూట 225 మందికి మించకుండా పరీక్ష నిర్వహించనున్నారు. ఎంవీజీఆర్‌లో 2,530 మంది, 28, 29 తేదీలలో ఐయాన్ డిజిటల్ జోన్‌లో 605 మంది పరీక్ష రాయనున్నారు.

నేడే శంబర పోలమాంబ..

సిరిమాను సంబరం



శంబర పోలమాంబ అమ్మవారు



సంబరానికి సిద్ధమైన సిరిమాను

- 3 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం
- ఉత్తరాంధ్రలో పలు ప్రాంతాల నుంచి 150 ఆర్టీసీ బస్సులు
- జాతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, విశాఖ రేంజ్ డీఐజీ
- 700 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహణ

సాక్షి ప్రతినిధి, విజయనగరం/మక్కువ:

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ముద్దుబిడ్డ శంబర పోలమాంబ అమ్మవారి సిరిమాను సంబరాన్ని మంగళవారం అంబరాన్ని అంటేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గత రెండేళ్లా కరోనా మహమ్మారి కారణంగా విధించిన ఆంక్షలు ఈసారి తొలగిపోయాయి. దీంతో సిరిమాను సంబరాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్ర నుంచే గాకుండా తెలంగాణా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. దాదాపు 3 లక్షల మంది వరకూ రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేశారు. మంగళవారం మధ్యాహ్నం రెండున్నర, మూడు గంటల సమయంలో సిరిమాను ఊరేగింపు ప్రారంభించేందుకు అధికారులు, గ్రామపెద్దలు చర్యలు చేపడుతున్నారు. గతేడాది సిరిమాను పొడవు 36 అడుగులు కాగా ఈసారి 39 అడుగుల పొడవున తయారుచేశారు. దీన్ని సిరిమానోత్సవానికి సిద్ధం చేశారు. పూజారి రామారావు అధిరోహించనున్నారు.

సిరిమాను విశిష్టత ఇలా...

అమ్మవారు శక్తి స్వరూపిణి. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి. పూజారి రూపంలో శంబర గ్రామంలోని పురవీధుల్లో సిరిమాను రథంపై నుంచి భక్తులకు దర్శనమిస్తారు. దీంతో భక్తులు పూజారికి అరటిపళ్లు, కొబ్బరికాయలు, చీరలు చూపించి మొక్కుబడులు చెల్లించుకుంటారు. విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఆర్డీఓ హేమలత సోమవారం శంబరలో జాతర ఏర్పాట్లును పరిశీలించారు. సిరిమాను తిరిగే పురవీధులను, గుడి వద్ద క్యూలైన్లను పరిశీలించారు.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలు

తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు...

పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి దాదాపు 150 ఆర్టీసీ బస్సులను అధికారులు నడుపుతున్నారు. సాలూరు వైపు నుంచి వచ్చే బస్సులను వనంగుడి వద్ద, పార్వతీపురం, బొబ్బిలి వైపు నుంచి వచ్చే బస్సులను జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పార్కింగ్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి వి.రాధాకృష్ణ, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ పూడి దాలినాయుడు పరిశీలించారు. వనంగుడి వద్దనున్న అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం, ఉచిత దర్శనం ఉంటాయి. 15 వేల లడ్డూలను, పులిహోర ప్రసాదాన్ని తయారు చేశారు. భక్తులకు సేవలందించేందుకు 90 మంది దేవదాయశాఖ సిబ్బంది, సుమారు వంద మంది సేవాసంఘాల ప్రతినిధులు జాతరలో విధులు నిర్వహించనున్నారు. చదురుగుడి సమీపంలో రెండు, వనంగుడి వద్ద ఒకటి ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటుచేశారు. పుణ్యస్నానాల తర్వాత భక్తులు వస్త్రాలను మార్పిడి చేసుకోవడానికి వీలుగా గదులు, తాత్కాలిక మరుగుదొడ్లను అందుబాటులో ఉంచుతున్నారు. వీధుల్లో వ్యర్థ పదార్థాలను వెనువెంటనే శుభ్రం చేయించేందుకు పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు మున్సిపాల్టీల నుంచి 45 మంది, పంచాయతీ నుంచి 30 మంది కార్మికులను నియమించారు.



బందోబస్తు విధులకు చేరుకున్న పోలీసులు

పూర్వజన్మ సుకృతం



సిరిమానును అధిరోహించడం పూర్వజన్మ సుకృతం. అత్యంత నిష్టతో గడుపుతాం. అమ్మవారి ఆశీస్సులతో సిరిమానును అధిరోహిస్తాను. గతేడాది నా సోదరుడు కుమారుడు జగదీశ్వరరావు సిరిమానును అధిరోహించగా, ఈ ఏడాది నాకు ఆ అదృష్టం దక్కింది. అమ్మవారి చల్లని కరుణ ప్రజలందరిపైనా ఉండాలి.

– రామారావు, సిరిమాను పూజారి



కంట్రోల్ రూమ్‌లు ఇలా..

కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు..

చదురుగుడి క్యూలైన్లు వద్ద, రామమందిరం వద్ద కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో రెవెన్యూ, పోలీస్, వైద్యం, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో అధికారులు ఉంటారు. చదురుగుడి క్యూలైన్ల వద్ద, అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీ, వనంగుడి, రామాలయం వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. తొమ్మిది మంది వైద్యాధికారులు, 30 మంది వైద్యసిబ్బంది అక్కడ విధినిర్వహణలో ఉంటారు. రెండు 108లు, 104 వాహనం, ఐదు ఫీడర్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. అగ్నిమాపక శకటాలను చదురుగుడి వెనుక, క్యూలైన్ వద్ద ఉంచారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో ఏఈ శాంతారావు పర్యవేక్షిస్తున్నారు.

కనులపండువగా తొలేళ్ల ఉత్సవం

- అమ్మవారిని దర్శించుకున్న భక్తలోకం
- ఉదయం నుంచి ప్రత్యేక పూజలు
- అమ్మవారి సేవలో అధికారులు
- జాతరలో సీఆర్‌పీఎఫ్ బలగాల పహారా



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం కనులపండువగా సాగింది. అమ్మవారి ఘటాలను ఆదివారం రాత్రి తిరువీధి జరిపిన అనంతరం శంబర ప్రధాన వీధిలో అమ్మవారి గద్దెవద్ద ఘటాలను ఉంచి, కారుగేద వాలకాలను నిర్వహించారు. మహిషాసురిణి, పోతురాజు వేషధారణ ప్రదర్శన డప్పువాయిద్యాలతో సాగింది. గ్రామానికి చెందిన రైతులు ఉపవాసాలతో ఉండి ఏరుత్సోవం నిర్వహించారు. గ్రామపెద్దలంతా ఏరోత్సవానికి జన్ని, గిరడ కుటుంబాలను ఆహ్వానించారు. జన్ని, గిరిడవారి ఇంటివద్ద నుంచి తెచ్చిన విత్తనాలను అమ్మవారి ముందు ఉంచి పూజలు చేశారు. అమ్మవారి అక్షితలను పశువులేర్లపై జల్లి పూజలు నిర్వహించారు. అనంతరం రైతులు తలోపిడికెడు విత్తనాలను ఇంటికి తీసుకెళ్లారు. వీటిని పంట పొలంలో సాగుచేసే విత్తనాల్లో కలిపి విత్తడం వల్ల పంటలు కలిసివస్తాయని, పంటలు బాగా పండేలా తల్లి ఆశీర్వాదం అందుతుందని రైతుల నమ్మకం. తొలేళ్ల ఉత్సవం అడిషనల్ ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఆర్డీఓ హేమలత, డీఎస్పీ ఎ.సుభాష్ , ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు ఛైర్మన్ పూడి దాలినాయుడు పర్యవేక్షణలో సాగింది. తొలేళ్ల ఉత్సవానికి గత ఏడాది కంటే భక్తుల రద్దీ తగ్గింది. భక్తులు ప్రధానాలయంలో ఉన్న అమ్మవారిని, వనంగడి వద్ద నున్న పెదపోలమాంబను దర్శించుకున్నారు. వనంగుడి వెనుకన ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. తలనీలాలు సమర్పించారు. చీరలు, కోళ్లు చూపించి మొక్కుబడులు చెల్లించారు. డీఎస్పీ సుభాష్, సీఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో పోలీస్ బలగాలు బందోబస్తు విధులు నిర్వహించాయి. సిరిమానును, నాటుబండిని ఆర్అండ్‌బీ జేఈ కమలాకర్, ఫారెస్ట్ ఆఫీసర్ నారాయణరావు పరిశీలించారు.

30 తులాల వెండి వడ్డాణం బహూకరణ

విజయనగరం పట్టణంలోని కె.ఎల్.పురానికి చెందిన పున్నాన రామునాయుడు, రమాదేవి దంపతులు శంబర పోలమాంబ అమ్మవారికి 30తులాలు వెండి వడ్డాణం, పట్టుచీర, చారె సామాన్లను సోమవారం సమర్పించారు. ఈఓ వి.రాధాకృష్ణ, దేవదాయశాఖ సిబ్బంది మురళీనాయుడుకు వెండి వడ్డానాన్ని అందివ్వగా, అమ్మవారికి అలంకరించారు. శంబర పోలమాంబ అమ్మవారిని విశాఖ పట్టణం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ దర్శించుకున్నారు. ఆయనను సాదరంగా ఆహ్వానించిన ఈఓ, ట్రస్టుబోర్డు ఛైర్మన్‌లు దుశ్శాలువతో సత్కరించారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, పటిష్టబందోబస్తు నిర్వహించాలని అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్‌కు డీఐజీ సూచించారు.



కారుగేద వేషధారణ ప్రదర్శన

శంబర చేరుకోవచ్చు ఇలా...

- మక్కువ నుంచి కవిరిపల్లి మీదుగా శంబరకు చేరుకోవాలంటే 6 కిలోమీటర్లు దూరం ప్రయాణించాలి.
- సాలూరు నుంచి మక్కువ మీదుగా 25 కిలోమీటర్లు దూరం ఉంటుంది.
- పార్వతీపురం నుంచి తాళ్లబురిడి మీదుగా శంబర చేరుకోవాలంటే 47 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి.
- పార్వతీపురం నుంచి చినబోగిలి మీదుగా శంబర చేరుకోవాలంటే 38 కిలోమీటర్లు ప్రయాణించాలి.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఇలా..

పార్వతీపురం టౌన్/విజయనగరం టౌన్: శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 150 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్, విజయనగరం డిపో మేనేజరు జె.శ్రీనివాసరావు తెలిపారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ, విజయనగరం, ఎస్.కోట, శ్రీకాకుళం–2 డిపోల నుంచి ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు తిరుగుతుందన్నారు.

డిపోల వారీగా బస్సులు ఇలా..

డిపో	బస్ సర్వీసులు
పార్వతీపురం	45
సాలూరు	50
పాలకొండ	10
ఎస్.కోట	10
విజయనగరం	20
శ్రీకాకుళం–2	15

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు



జాతర ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

మక్కువ: జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శంబర గ్రామానికి సోమవారం చేరుకొని జాతర ఏర్పాట్లను పరిశీలించారు. వైద్యశిబిరాల నిర్వహణ, మందుల నిల్వలను వైద్యాధికారి రఘును అడిగి తెలుసుకున్నారు. అనంతరం చదురుగుడిలోని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం చదురుగుడి ఆలయం వెనుక ఉన్న క్యూలైన్‌లు, మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లకు నీటిసరఫరాతో పాటు, ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఈఓ రాధాకృష్ణకు, ఎంపీడీఓ దేవకుమార్‌ను ఆదేశించారు. చదురుగుడి ముందున ఉన్న ప్రసాదం కౌంటర్ వద్ద విద్యుత్ లైట్లను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. సిరిమాను తిరిగే సమయంలో వీధుల్లోని ప్రజలు గుంపులుగా లేకుండా చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ దిలీప్ కిరణ్‌కు సూచించారు.

‘కంటి వెలుగు’లో మన్యం ముందంజ

- కార్యక్రమం అమలులో 62.02 శాతంతో ప్రథమ స్థానం
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో అమలవుతున్న డా.వైఎస్సార్ అవ్వాతాత కంటి వెలుగు కార్యక్రమం అమలులో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమం అమలుపై ప్రోగ్రాం జిల్లా మేనేజర్ డా.సుకుమార్‌బాబుతో కలిసి తన కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. జిల్లాలో 60 ఏళ్ల వయస్సు దాటిన వారు లక్షా 6వేల మంది ఉండగా, ఇప్పటి వరకు 65,851 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 62.02 శాతంతో ముందంజలో ఉన్నామన్నారు. నేత్ర వైద్యుల సేవలను కొనియాడారు. మరింత స్ఫూర్తితో కార్యక్రమాన్ని శతశాతం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో కంటి వెలుగు జిల్లా వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి, నేత్ర వైద్యులు పాల్గొన్నారు.

2.13 లక్షల టన్నుల చెరకు క్రషింగ్

- రూ.15.5 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ
- జనవరి 15 వరకు చెరకు బిల్లుల చెల్లింపు పూర్తి
- సంకిలి ఈఐడీ ప్యారిస్ ఏజీఎం(కేన్) అప్పారావు



మాట్లాడుతున్న ఈఐడీ ప్యారిస్ ఏజీఎం(కేన్) అప్పారావు

సీతానగరం: సంకిలి ఈఐడీ ప్యారిస్ చక్కెర కర్మాగారంలో ఇప్పటివరకు 2,13,651 టన్నుల చెరకు క్రషింగ్ జరిగినట్టు ఏజీఎం (కేన్)అప్పారావు తెలిపారు. లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం పరిధిలో చెరకు సరఫరా తీరును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీతానగరంతో స్థానిక విలేకరులతో మాట్లాడారు. నవంబర్ 19న క్రషింగ్ ప్రారంభించామని, మరో 3.37లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయాల్సి ఉందన్నారు. జనవరి 15 వరకు చెరకు సరఫరా చేసిన రైతుల ఖాతాలకు రూ.15.5 కోట్లను బిల్లుల రూపంలో జమ చేశామని చెప్పారు. ఎన్‌సీఎస్ కర్మాగారం పరిధిలో 48,500 టన్నులు, భీమసింగ్ సుగర్‌ఫ్యాక్టరీ పరిధిలోని రైతులు 6,500 టన్నుల చెరకును సరఫరా చేశారన్నారు. వచ్చే క్రషింగ్ సీజన్‌కు రైతులకు అందుబాటులో చెరకు తూనిక యంత్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చెరకు రైతు నాయకుడు బలగ శ్రీరాములు పాల్గొన్నారు.

ఎంపీడీఓలకు సంక్షేమ పథకాల అమలు బాధ్యత

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత మండలాభివృద్ధి అధికారులదేనని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. హౌసింగ్, గ్రామీణ నీటిసరఫరా, ఉపాధిహామీ పనులు, పంచాయతీ, రెవెన్యూశాఖల పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల లక్ష్యాల సాధనపై కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో మండల అధికారులతో సోమవారం సమీక్షించారు. ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించామని, నిధులకొరత లేదని స్పష్టంచేశారు. పీఎం జేవై కార్డులకు ఈకేవైసీ అనుసంధానాన్ని వేగవంతం చేయాలన్నారు. జలజీవన్‌మిషన్ కింద వారానికి కనీసం మూడువేల కనెక్షన్ల లక్ష్యాన్ని పూర్తిచేయాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని, చేసిన పనులకు బిల్లులు బుధవారంలోగా అప్‌లోడ్ చేయాలన్నారు. జేసీ ఒ.ఆనంద్ మాట్లాడుతూ మ్యుటేషన్‌లు, కరెక్షన్లను సకాలంలో పూర్తిచేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ఈఈ ఎం.వి.జి.కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, డుమా పీడీ కె.రామచంద్రరావు, డీఈఓ రమణ, డీపీఓ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో మన ఎమ్మెల్సీలు



సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, రఘురాజు

నెల్లిమర్ల: న్యూఢిల్లీలో సోమవారం ప్రారంభమైన జాతీయ విధాన వర్క్‌షాప్‌లో ఎమ్మెల్సీలు డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు), ఇందుకూరి రఘురాజు పాల్గొన్నారు. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ‘రాష్ట్రాల ఆర్థిక వనరులు’ అనే అంశంపై రెండ్రోజుల పాటు జరగనున్న సదస్సుకు హాజరయ్యారు. మొదటి రోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పన్నుల రాబడి, వాటాల కేటాయింపుపై ఆర్థిక వేత్తలు వివరించినట్లు ఎమ్మెల్సీలు స్థానిక విలేకరులకు ఫోన్‌లో తెలిపారు. స్థానిక సంస్థల పన్నులు, విపత్తుల నిర్వహణ గ్రాంట్లు, రెవెన్యూ ఖర్చులను వివరించారన్నారు.

బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: బాలికల విద్య, ఆరోగ్యంపై జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాలికల విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 24న నిర్వహించనున్న జాతీయ బాలికా దినోత్సవం వాల్ పోస్టర్లను జెడ్పీ కార్యాలయంలో ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యవంతంగా, సంతోషంగా ఉండేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. లింగ వివక్ష లేకుండా చూడాలన్నారు. బాలికల భద్రతకు ప్రభుత్వం దిశయాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. నాణ్యమైన విద్య కోసం అమ్మ ఒడి, నాడు–నేడు, జగనన్న విద్యాకానుక, కంటి వెలుగు, జగనన్న గోరుముద్ద వంటి బృహత్తర పథకాలు అమలుచేస్తోందన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలికల కోసం రూపొందించిన చట్టాలను కఠినంగా అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెత్తసంపద కేంద్రం మోటార్ అపహరణ

మెరకముడిదాం: గర్భాం మేజర్‌పంచాయతీకి సంభంధించిన చెత్త నుంచి సంపద కేంద్రానికి చెందిన మోటార్‌ను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయినట్టు మేజర్‌పంచాయతీ ఈఓ వాసుదేవరావు సోమవారం బుదరాయవలస పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల వరకూ ఉండేదని దానిని ఎవరో అపహరించుకుపోయారని ఫిర్యాదులో పేర్కొంటూ విచారణ చేపట్టాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బొబ్బిలి రూరల్: మండలంలోని కాశిందొరవలసకు చెందిన దాసరి రామలక్ష్మి మనస్తాపానికి గురై సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు, కుటుంబసభ్యులు గుర్తించి, బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతోంది. ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన భర్త పైడిపునాయుడు ఐదేళ్లక్రితం మృతిచెందాడని, అప్పటినుంచి మరిది వేధిస్తున్నాడని న్యాయం చేయాలని రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన ఫిర్యాదుపై పోలీసులు చర్యలు చేపట్టడంలేదని మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. రామలక్ష్మి ఫిర్యాదుపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడు..

పార్వతీపురం: తల్లి మందలించిందని మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం ఏరియా ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం చెల్లంనాయుడువలస గ్రామానికి చెందిన చంద్ర సోమేశ్వరరావు సోమవారం మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన సోమేశ్వరరావు పొలానికి వినియోగించగా ఇంట్లో మిగిలి ఉన్న పురుగుమందు తాగేశాడు. విషయం గమనించిన చుట్టుపక్కలవారు మందును కక్కించి 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- అవంతి విద్యార్థి మృతి
- మరో ఇద్దరికి గాయాలు

మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా): బైక్‌తో ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు.. తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం పొదలాడకు చెందిన లంకె తరుణ్‌బాబు, సింగిరెడ్డి దినేష్(విజయనగరం), రావాడ లోకేష్(శ్రీకాకుళం)లు మండలంలోని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు. వీరంతా కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. అయితే ఆదివారం రాత్రి మోటారు సైకిల్‌పై నర్సీపట్నం వెళ్లిన వీరు తిరిగి వస్తుండగా రాచపల్లి జంక్షన్ సమీపంలో కామేశ్వరమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో తరుణ్‌బాబు అక్కడికక్కడే మృతి చెందగా, దినేష్ తీవ్రంగా, లోకేష్ స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న దినేష్‌ను విశాఖ తరలించారు. ఈ ఘటనలో బైక్ నుజ్జునుజ్జయింది. కొద్ది నిమిషాల వ్యవధిలోనే హాస్టల్‌కు చేరుకోనున్న తరుణ్‌బాబు మృతి చెందడంతో తోటి విద్యార్థులు, కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

రక్తహీనతతో గర్భిణి మృతి

కురుపాం: మండలంలోని పి.లేవిడి గ్రామంలో ఎనిమిది నెలల గర్భిణి రక్తహీనతతో సోమవారం మృతి చెందింది. ఈ సంఘటనపై ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆరిక శ్రావణి (23) 8 వ నెల గర్భిణి. ఈ నెల మొదటి వారంలో గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ మెడికల్ క్యాంప్ నిర్వహించగా రక్తపరీక్షల్లో ఏడు పాయింట్స్ ఉన్నట్లు గుర్తించిన వైద్యాధికారులు పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యాధికారులు గర్భిణికి రక్తం ఎక్కించి కడుపులో బిడ్డ అడ్డంగా తిరిగిందని అప్రమత్తంగా ఉండాలని సూచించినా ఆమె ఆస్పత్రిలో ఉండకుండా స్వగ్రామానికి వెళ్లిపోయింది. ఆదివారం సాయంత్రం పురిటి నొప్పులు రాగా భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి 108 లో తీసుకువెళ్లి పరీక్ష చేయించారు. సోమవారం డిశ్చార్జ్ చేయడంతో ఇంటికి తీసుకు రాగానే ఇంటివద్ద మృతి చెందింది.

ఆటకు అగ్ర తాంబూలం

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్
- రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



కబడ్డీ ఆడుతున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల రూరల్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అగ్ర తాంబూలం వేస్తోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి క్రీడలు, క్రీడాకారులంటే ఇష్టమన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం సంపాదిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు.

కబడ్డీ ఆడిన ఎంపీ, ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందు వరుసలో ఉందన్నారు. ప్రభుత్వం సమకూరుస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుని రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కొలువుల్లో స్థిరపడవచ్చునని, కొండవెలగాడకు చెందిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ తదితర ప్రజా ప్రతినిధులు కాసేపు కబడ్డీ ఆడి అలరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములునాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ప్రసాదరావు, డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు, ఆర్‌ఐపీ మనోహర్, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, సర్పంచ్ బంగారమ్మ, సీనియర్ కోచ్ పతివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నలుమూలల నుంచి హాజరు..

కబడ్డీ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులతో అలుగోలులో పండగ వాతావరణం నెలకొంది. బాలుర విభాగం నుంచి 13, బాలికల విభాగం నుంచి 13 జట్లు హాజరయ్యాయి. తొలి రోజు ఆయా జట్ల మధ్య కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సీనియర్ క్రీడాకారులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



తవిటినాయుడు మృతదేహం

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయ రహదారిపై సోమవారం గుర్తు తెలియని వాహనము ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు, వివరాలిలా ఉన్నాయి. పి.కోనవలస గ్రామానికి చెందిన సింగారపు తవిటినాయుడు (32) సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు, విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండంతో విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కృపారావు తెలిపారు.



మృతి చెందిన శంకరరావు

కారు ఢీకొని మరొకరు..

గరుగుబిల్లి: పార్వతీపురం-శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలో గరుగుబిల్లి మండలం పిట్టలమెట్ట జంక్షన్ సమీపంలో బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివ రాలిలా ఉన్నాయి. వీరఘట్టం నుంచి పార్వతీపురం వైపు వస్తున్న కారు, పార్వతీపురం నుంచి తురకనాయుడువలస వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో తురకనాయుడువలసకు చెందిన కొత్తాడ శంకరరావు(25) సంఘటనా స్థలంలోనే ప్రాణా లు కోల్పోయాడు. మృతుడి తమ్ముడు సోమేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు.

మృత్యువే గెలిచింది

- దాతలు స్పందించినా దక్కని ప్రాణం



పెదపూడి అప్పారావు (ఫైల్)

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన విధి వంచితుడు పెదపూడి అప్పారావుపై మృత్యువే గెలిచింది. అప్పారావు (32) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న విషయాన్ని గత ఏడాది నవంబర్ 7న 'విధి వంచితుడు' శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి స్పందించిన దాతలు వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం చేశారు. దీంతో కేన్సర్ ఆపరేషన్ చేసినప్పటికీ రెండు నెలల వ్యవధిలో వ్యాధి మళ్లీ సోకడంతో దాతల సహాయానికి ఫలితం దక్కలేదు. మృతునికి భార్య, కుమారుడు, తల్లి ఉన్నారు. పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

30న నైరేడ్ ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం: పట్టణంలోని జీఎంఆర్ నైరేడ్ స్వచ్ఛంద నిర్వహిస్తున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు సంబంధించిన పలు కోర్సులకు ఈనెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పీఓ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పురుష అభ్యర్థులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ అండ్ ఫ్యాన్ రీవైండింగ్ (50 రోజుల శిక్షణ), ఎల్‌ఎమ్‌వీ కారు డ్రైవింగ్(30 రోజుల శిక్షణ), సెల్‌ఫోన్ రిపేర్ అండ్ సర్వీసింగ్ (30 రోజుల శిక్షణ) ఉంటుందన్నారు. మహిళా అభ్యర్థులకు లేడీస్ టైలరింగ్ (30 రోజుల శిక్షణ), బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ (30 రోజుల శిక్షణ) ఉంటుందని వివరించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల లోపు ఆసక్తి గల అభ్యర్థులు ఈ శిక్షణ వినియోగించుకోవచ్చని వెల్లడించారు. 30న రాజాంలో జీఎంఆర్ కేర్ ఆస్పత్రి పక్కన నైరేడ్‌లో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరుకాగలరని కోరారు. 10వ తరగతి మార్క్స్‌లిస్ట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం, టీ షర్ట్, టూల్ కిట్ ఉచితంగా ఇస్తామని, ఫిబ్రవరి 2 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 9989953145, 9014716255 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం

- డీఎంహెచ్‌ఓ రమణకుమారి




సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని, ఈనేరానికి పాల్పడిన వారికి గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం 1994 ప్రకారం 3 ఏళ్ల జైలు శిక్ష రూ. 10 వేల జరిమానా విధిస్తారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి తెలిపారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థలింగ నిర్ధారణ చట్టం, లింగ వివక్ష నిర్మూలనపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెండోసారి లింగ నిర్ధారణ వెల్లడించిన వారికి 5 ఏళ్ల జైలు శిక్ష రూ. 50 వేల జరిమానా విధిస్తారన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ చేయడమే కాకుండా చేయాలని అడగడం కూడా నేరమేనని చెప్పారు. లింగ వివక్షను రూపు మాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. గర్భం దాల్చిన మూడు నెలల తరువాత గర్భస్రావం చేయిస్తే తల్లి ప్రాణాలకు ప్రమాదమని హెచ్చరించారు. అయినప్పటికీ లింగ నిర్ధారణ పరీక్షలు అన్ని స్థాయిల్లో అరికట్టాల్సి ఉందన్నారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టి సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో దిశ పోలీస్ స్టేషన్ ఇనస్పెక్టర్ శేషు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ, ఆర్‌డీఓ కార్యాలయం ఏఓ ప్రభాకర్‌రావు, పీసీ పీఅండ్‌టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రసాద్, నేచర్ సంస్థ ప్రతినిధులు దుర్గ, అనిల్, మీనా తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలి

- కలెక్టర్ సూర్యకుమారి



వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన వినతుల కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 221 అర్జీలు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి అత్యధికంగా 166 ఉన్నాయి. డీఆర్‌డీఏకు 17, హౌసింగ్‌కు 15, మున్సిపల్ శాఖకు 7, వైద్యశాఖకు 11, ఇతర శాఖలకు మిగిలినవి ఉన్నాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ ఏ.సూర్యకుమారి, డీఆర్‌ఓ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, సూర్యనారాయణ, దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందిన వినతులు పెండింగ్ పెట్టకుండా పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.


ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదుదారులకు సత్వర న్యాయమందించే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందనలో భాగంగా 44 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. విజయనగరం ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐలు సీహెచ్.రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగౌరమ్మ యాత్రకు భారీ ఏర్పాట్లు



మజ్జిగౌరమ్మ దేవత

రాజాం: మండలంలో అంతకాపల్లి గ్రామంలో వెలసిన మజ్జిగౌరమ్మ దేవత ఆలయ 44వ వార్షిక యాత్రకు భారీగా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈఏడాది పెద్ద ఎత్తున ఈయాత్ర నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు వెల్లడించారు. ఫిబ్రవరి 3 నుంచి 5 వ తేదీ వరకూ మూడు రోజుల పాటు ఈ యాత్ర ఉంటుందన్నారు. ఆదివారం యాత్ర ముగింపు సందర్భంగా పెద్ద ఎత్తున దర్శన కార్యక్రమాలు, విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రాయగడలో వెలసిన మజ్జిగౌరమ్మకు ప్రతి రూపంగా ఇక్కడ దేవతను కొలుస్తారని, విజయనగరం పరిసర జిల్లాల భక్తులతో పాటు ఒడిశాకు చెందిన భక్తులు కూడా యాత్ర సమయంలో ఇక్కడికి వస్తారని వెల్లడించారు.

ఫిబ్రవరి 11 నుంచి తెలుగు నాటిక పోటీలు

- నాటక పరిషత్ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అభినయ శ్రీనివాస్, తదితరులు

విజయనగరం టౌన్: రాష్ట్ర స్థాయి తెలుగు ఆహ్వాన నాటిక పోటీలను ఫిబ్రవరి 11, 12, 13 తేదీల్లో గురజాడ కళాభారతిలో ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నటరత్న నాటక పరిషత్ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. నాటకశాల, అభినయ సంయుక్త నిర్వహణలో 7వ రాష్ట్రస్థాయి తెలుగు ఆహ్వాన నాటిక పోటీలకు సంబంధించిన కరపత్రాలను శివాలయం వీధిలో ఉన్న కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11న శనివారం కరీంనగర్ చైతన్య కళాభారతి 'చీకటి పువ్వు', నాటకశాల నటసేవా సమాజం, విజయనగరం 'మహర్షి' నాటికలు ప్రదర్శిస్తాయని తెలిపారు. 12న పల్నాడు జిల్లా, చిలకలూరిపేట అంజనా రాథోడ్ థియేటర్ ఆధ్వర్యంలో 'నాన్నా నేనొచ్చేస్తా', గుంటూరు శ్రీ సద్గురు కళానిలయానికి చెందిన 'కమనీయం' నాటికలు ఉంటాయన్నారు. అదేవిధంగా 13న మద్దుకూరి క్రియేషన్స్, పల్నాడు ఆధ్వర్యంలో 'మృత్యుపత్రం', గుంటూరు కట్రపాడు ఉషోదయ కళానికేతన్ 'ప్రక్షాళన' నాటికలు ప్రదర్శిస్తారన్నారు. మూడోరోజులు నిర్వహించే ప్రదర్శనల అనంతరం ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులతో పాటూ ప్రముఖ రంగస్థల కళాకారునికి ఎన్‌టీఆర్ రంగస్థల పురస్కారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి గెద్ద వరప్రసాద్, ఎంఎస్‌ఆర్. నాయుడు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందన దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు వెంటనే పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్పందనలో ప్రజలు తెలియజేసిన సమస్యలపై వారి సమక్షంలోనే సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి పరిష్కారం చూపిస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్‌తో కలిసి నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజలనుంచి 96 అర్జీలను కలెక్టర్ నిషాంత్ కుమార్ స్వీకరించారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్‌డీవీ రమణ, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథం, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, డీఆర్‌డీఏ పడీ పి.కిరణ్ కుమార్, పీఆర్ ఈఈ ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకర రావు, డ్వామా పీడీ కె. రామచంద్ర రావు, గ్రామ, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ వి.చిట్టిబాబు, పౌర సరఫరాల సంస్థ డీఎం ఎం.డి. నాయక్, జిల్లా పౌర సరఫరా అధికారి కేవీఎల్ఎన్ మూర్తి, డీపీఓ బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ సీఐ శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వారి సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై దినకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్ల టీడీపీకి గౌరవం లేదు

- అనుమతి తీసుకుని లోకేష్ పాదయాత్ర చేసుకోవచ్చు
- మీడియా సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, హాజరైన నాయకులు

విజయనగరం గంటస్తంభం: రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులకు గౌరవం లేదని వైఎస్సాఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మాటలు చూస్తే ఈవిషయం స్పష్టంగా అర్థమవుతుందన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 1పై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎవరైనా పాదయాత్రలు, రాజకీయ కార్యక్రమాలు చేసుకోవచ్చునని, పోలీసు అనుమతి తీసుకుని చేయాలని ప్రభుత్వం అడుగుతోందన్నారు. లోకేష్ పాదయాత్రను ఎవరూ అడ్డుకోలేదని, అడిగితే అనుమతులిస్తారని స్పష్టం చేశారు. అయితే మేము అనుమతులు తీసుకోం, పాదయాత్రలు చేసుకుంటామని అచ్చెన్నాయుడు ప్రకటనలు చేయడం సరి కాదని, ఈవిషయాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. జీవో నంబర్ 1 ఎందుకు తీసుకురావాల్సి వచ్చిందో ప్రజలకు తెలుసన్నారు. కందుకూరు, గుంటూరు వంటి ఘటనల వల్ల ప్రజలకు భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రజల ప్రాణాలు ఫణంగా పెట్టి కార్యక్రమాలు చేస్తామంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు కదా అని ప్రశ్నించారు. ఇబ్బంది కలగకుండా ప్రతిపక్షాలు కార్యక్రమాలు చేసుకోవాలని సూచించారు.

4.54లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు

విజయనగరంలో 2.64లక్షలు మెట్రిక్ టన్నులు, మన్యం జిల్లాలో 1.90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం డిసెంబరు 20 నుంచి జనవరి 10తేదీ లోగా కొనుగోలు చేసిన ఘనత వైఎస్సాఆర్ సీపీ ప్రభుత్వానిదని మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. రైతులకు పండగ కానుకగా బిల్లులు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశంతో నిబంధనల ప్రకారం 21రోజుల్లో ఇవ్వాలని ఉన్నా అంతకుముందే ఇచ్చామన్నారు. సమావేశంలో విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, గుర్ల జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి. సూర్యనారాయణ రాజు, బెల్లాన బంగారునాయుడు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

- ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి



సాయికల్యాణ్ చక్రవర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

విజయనగరం లీగల్: కోర్టు కేసుల్లో రాజీయే రాజమార్గమని కక్షిదారులందరూ రాజీ మార్గాన్ని అనుసరించాలని, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి హితవు పలికారు. ఈ మేరకు జిల్లా కోర్టులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 11న ఉమ్మడి జిల్లాలో జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లను కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌లలో కేసులను పరిష్కరించుకుంటే ఇరుపార్టీలు గెలిచినట్లు అవుతుందని, డబ్బులు, సమయం వృథా కాదన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లలో పలు సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద బీమా కేసులు, ఎలక్ట్రిసిటీ, ఎక్సైజ్, మనీ, చెక్‌బౌన్స్ కేసులను పరిష్కరిస్తారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో విజయనగరం, పార్వతీపురం మన్యం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, కురుపాం కోర్టులలో జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయసేవా సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220